క్లుప్తంగా

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

సీతమ్మధార/దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 27వ వార్డు, దొండపర్తి చుక్కావారి వీధిలో నివసిస్తున్న మజ్జి సత్యవతి (63) వెన్నుముక సమస్యతో బాధపడుతున్నట్లు స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్యం కోసం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే నెహ్రూ బజారు హరిజన వీధికి చెందిన ముత్తు పైడమ్మ (60) హార్ట్‌స్ట్రోక్‌తో బాధపడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా స్టంట్ వేయించుకున్నారన్న సమాచారంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమెకు కూడా రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. 33వ వార్డు హరిజన వీధికి చెందిన కంఠంశెట్టి లక్ష్మీకాంతం ఇటీవల ప్రమాదానికి గురైన నేపథ్యంలో వైద్య ఖర్చుల కోసం రూ.5 వేలు, బంగారమ్మ మెట్ట ప్రాంతానికి చెందిన పాల్తేటి శివకు రూ.5 వేలు అందజేశారు. వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, రంధి గోపి, దశమంతుల మాణిక్యాలరావు, సకలాభక్తుల ప్రసాద్, కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, బ్రహ్మం, ఊర్వశి, సత్యవతి, గంగ పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ ఆలయంలో అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈవో రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారిని పూజించారు. ఉదయం గణపతి పూజ, అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. పంచామృతాభిషేకం అనంతరం విశేష పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులిచ్చారు. అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

21న 'అస్త్ర' ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష

దాబాగార్డెన్స్: సివిల్ సర్వీస్ ఆశావహులను ఎంపిక చేయడానికి ఈ నెల 21న ఆన్‌లైన్ పోటీ పరీక్ష నిర్వహించనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఎనలాగ్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకుడు శ్రీకాంత్ విన్నకోట తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో స్కాలర్‌షిప్ పరీక్ష వివరాలు వెల్లడించారు. ఈ పరీక్షలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అగ్రగణ్యులుగా నిలిచిన వారికి శతశాతం రాయితీని ప్రకటించారు. అస్త్ర పరీక్ష ద్వారా ఉత్తమ సివిల్ సర్వెంట్లను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా అత్యధిక శాతం మార్కులు సాధించి తొలి 3 స్థానాల్లో నిలిచేవారికి రాయితీతో ఉపకార వేతనాలు అందజేయనున్నట్టు చెప్పారు. www.analogeducation.inలో లాగిన్ అయి దరఖాస్తు పూర్తి చేయాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయడంలో సమస్యలుంటే ఎనలాగ్ సంస్థ సహాయకులను 8494990066 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

18 నుంచి చీరల వేలం

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలం కార్యక్రమం ఉంటుందని, భక్తులు అమ్మవారి చీరల వేలంలో పాల్గొనగలరని కోరారు.

నిప్పుల కొలిమిలో.. జీవన సమరం



గొడుగు నీడలో మామిడి పండ్లు విక్రయిస్తున్న మహిళలు



మండుటెండలో పొట్ట కూటి కోసం అవస్థ పడుతున్న స్వర్ణకారుడు

దాబాగార్డెన్స్: నెత్తిన సూరీడు మండిపోతున్నాడు. పక్షం రోజులుగా ఎండ తీవ్రత తారాస్థాయికి చేరుకుంది. బయటికొస్తే నిప్పుల కొలిమి.. ఇంట్లో ఉంటే ఊపిరాడదు. ఇలాంటి పరిస్థితుల్లో చిరువ్యాపారులు.. బడుగులు ఎండల్లో మండిపోతున్నారు. వ్యాపారం సాగక.. మండుటెండలోనే బతుకు బండి ఈడుస్తున్నారు. నగర ప్రజల కోసం సుదూర ప్రాంతాల నుంచి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. వేకువ జామునే వారి గ్రామాలు వదిలి పట్టణానికి వచ్చి విక్రయిస్తుంటారు. కానీ ఫలితం దక్కడం లేదనే ఆవేదనలో ఉంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు మండుటెండల్లోనే బతుకుబండి ఈడుస్తున్నామని వాపోతున్నారు. ఎండ తీవ్రతకు తీవ్రంగా నష్టపోవడమే కాక.. అనారోగ్యాలకు గురవుతున్నామే తప్ప.. సుదూర ప్రాంతం నుంచి వచ్చినందుకు తగిన ఫలితం కూడా దక్కడం లేదనే ఆవేదనలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఎంతో మంది కార్మికులు మండుటెండల్లోనే బతుకుపోరు సాగిస్తున్నారు. నెత్తిన చుర్రుమంటున్న ఎండలోనే ఓ కార్మికుడు లారీ/వ్యాన్‌కు టింకరింగ్ చేస్తూ బతుకుబండి లాగిస్తున్నాడు.. పొట్టకూటికోసం.. కుటుంబ పోషణకు ఓ వృద్ధ స్వర్ణకారుడు టౌన్‌కొత్తరోడ్డు వద్ద మండుటెండలోనే స్వర్ణకార పనులు చేసుకుంటూ సాక్షి కంటపడ్డాడు. అదే విధంగా అల్లిపురం, కెప్టెన్ రామారావు జంక్షన్, పూర్ణామార్కెట్ వంటి చోట్ల ఎంతో మంది చిరు వ్యాపారులు ఎలాంటి రక్షణ లేకుండా మండే ఎండలో వ్యాపారులు చేసుకుంటూ కనిపించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మందిరిక్షా లాగేవారు, ఆటో కార్మికులు, తోపుడు బండ్ల వ్యాపారులు, కళాసీలు మండుటెండలోనే బతుకుబండి ఈడుస్తున్నారు.

అవస్థలు పడుతున్న వృద్ధులు..

మండుటెండలకు వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఎండ వేడి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వ్యాపారం సాగక.. అనారోగ్యంతో సతమతమవుతూ బతుకుబండి ఈడుస్తున్నారు.

'బీజేపీ ఎంపీని తక్షణం అరెస్టు చేయాలి'



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పౌర సంఘాల నాయకులు

సీతమ్మధార: రెజ్లర్లపై లైగింక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరన్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని పౌర ప్రజా సంఘాల వేదిక నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంపీపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇంత వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. దేశానికి వన్నెతెచ్చిన క్రీడాకారుల పట్ల బీజేపీ వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో అనురాధ, మధు, కృష్ణ, వెంకట్, దేముడమ్మ, బేగం, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

జీఎస్టీ ఉపసంహరించుకోవాలి

అల్లిపురం: జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, బీమా రంగాన్ని ప్రభుత్వంలోనే కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. బీమా కంపెనీలు నిరుద్యోగులకు అండగా ఉంటున్నాయని, ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. ఇంత కాలం భారతదేశ ప్రజలు బీమా కంపెనీలకు అందజేస్తున్న మద్దతును ఇలానే కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

స్టాపర్ల తొలగింపుతో ఇక్కట్లు



స్టాపర్లు తొలగించడంతో ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తున్న వాహనాలు

మహారాణిపేట : నిత్యం రద్దీగా ఉండే కేజీహెచ్ వద్ద గల రోడ్డు స్టాపర్లను తొలగించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గతంలో ఓపీ గేటు వరకు ఇన్–అవుట్ దారుల వద్ద స్టాపర్లు ఉండేవి. వీటిని ఆ తర్వాత తొలగించారు. ఎందుకు తొలగించారో ఎవరికీ తెలియదు. ఇలా చేయడం వల్ల కేజీహెచ్ అవుట్ గేటు, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే దారిలో ట్రాఫిక్ అస్తవ్యవస్తంగా తయారైంది. ఇన్‌లో వచ్చి అవుట్‌లోకి వెళ్లడం, అవుట్‌లోకి వచ్చి ఇన్‌లోకి వెళ్లడం వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డు మధ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు నడుస్తున్నాయి. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్టాపర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



వృద్ధురాలి మృతదేహం

అల్లిపురం: కాన్వెంట్ జంక్షన్ వద్ద చెట్టుకు ఉరి వేసుకుని సుమారు 50 సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలయని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేయగా ఆమె యాచకురాలని, నెల రోజులుగా కాన్వెంట్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో తిరుగాడుతుందని స్థానికులు తెలిపారు. హార్బర్ గేటు సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతి చెందిన వృద్ధురాలు ఆకుపచ్చ చీర, కుంకుమ రంగు జాకెట్టు ధరించి ఉందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013, 9 ఫోన్ నంబర్‌లో తెలియజేయాలని కోరారు.

వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలిని ఆశ్రమానికి తరలిస్తున్న మమత

అల్లిపురం: ఒక వృద్ధురాలిని ఎవరో కేజీహెచ్‌లో చేర్చి వెళ్లిపోయారు. ఆమె వివరాలు తెలియజేసే పరిస్థితిలో లేదు. ఆమెను తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు కేజీహెచ్ ఉద్యోగులు సమాచారం అందజేశారు. దీంతో ఆమె వెంటనే స్పందించి కేజీహెచ్ నుంచి వృద్ధురాలిని డిశ్చార్జి చేయించి మన కుటుంబం వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.

మజ్జిగ పంపిణీ

మురళీనగర్: వేసవి దృష్ట్యా బాటసారుల దాహార్తి తీర్చేందుకు మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, కూరలు, పండ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు మజ్జిగ అందజేశారు. సైదా జహాన్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత, కోశాధికారి లక్ష్మి, ఉపాధ్యక్షులు లీలా నాయుడు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో రెహమాన్‌కు బంగారు పతకం

సీతంపేట: ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో బీఏ చదువుతున్న విద్యార్థి షేక్ ముజీబ్ రెహమాన్ బంగారు పతకం సాధించాడు. 67–71 కిలోల విభాగంలో మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ రెహమాన్‌ను అభినందించారు.

ఎన్ఎస్‌టీఎల్ సందర్శన



ఎన్ఎస్‌టీఎల్ సందర్శనకు వెళ్లిన ఏయూ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం విద్యార్థులు బుధవారం నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)ని సందర్శించారు. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా ఎన్ఎస్‌టీఎల్ ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా ఏయూకు చెందిన 60 మంది విద్యార్థులను విభాగాధిపతి డి.బి.వెంకటాద్రి ఎన్ఎస్‌టీఎల్‌కు తీసుకువెళ్లి, అక్కడ జరిగే పరిశోధనల వివరాలను తెలియజేశారు.

13న సహస్రచండీ పారాయణ, హోమం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్ : లోక కల్యాణార్థం ఆర్కే బీచ్ వేదికగా ఈ నెల 13న మధ్యాహ్నం 3 గంటల నుంచి సహస్ర చండీ పారాయణ, హోమం నిర్వహించనున్నట్టు ప్రతినిధి అవసరాల ప్రసన్నకుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృతానంద నాథ సరస్వతి దివ్య ఆశీస్సులతో, శ్రీవేణి మాత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 108 హోమ కుండములతో 1008 మంది భక్తులతో ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించామన్నారు. హోమంలో పాల్గొనే వారు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా అందిస్తామన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మాత్రమే హోమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 91600 05430, 94403 30246 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చల్ల కృష్ణవీర్ అభిషేక్, మలేశ్వరరావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుడి వార్షిక కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

సీతంపేట: శంకరమఠం రోడ్‌లోని దేవదాయ శాఖ పరిధిలోని రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో జరిగిన ఈ వేడుకలో సుమారు 250 మంది దంపతులు పాల్గొని తరించారు. ఆలయ అర్చకులు వేదమమంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ముందుగా మేళతాళాలతో స్వామి వారి తిరువీధి ఊరేగింపు నిర్వహించారు.

గజేంద్ర మోక్షంపై ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్ గజేంద్ర మోక్షంపై ప్రసంగించారు. శరణు కోరిన వారి రక్షణ బాధ్యత భగవానుడే స్వీకరించి కాపాడుతాడన్నది సత్యమని, భాగవతంలోని అష్టమ స్కందంలో పోతన దీని గురించి వివరించాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ భాగవతాన్ని పఠించి తరించాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి. సూర్యారావు, ఫణిశయన సూరి, కె.వి.ఎస్.మూర్తి, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు బిశ్వాస్, గెంబలి జగదీష్, కోసూరు రాజు, నాయుడు, కుసుమ, గౌరి, స్వర్ణ, లక్ష్మీప్రియ సినీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జి.జగదీష్, కళా సంస్థల ప్రతినిధులు చెన్నా తిరుమలరావు, సన్‌మూర్తి, ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

దాబాగార్డెన్స్: జోన్–4 పరిధి 31వ వార్డులో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. చాకలిపేట, గొల్లలపాలెం, లక్ష్మీవీధి పరిధిలో సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, సీసీ కాలువ, బ్రిడ్జి (నడక వంతెన) పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధిలో భాగంగా 31వ వార్డులో వార్డు కార్పొరేటర్ విన్నపం మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వార్డులో మిగిలిన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, జోన్–4 పరిధిలో తాగునీరు, వీధిదీపాల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తుందని, ప్రతి సంక్షేమ పథకం, అభివృద్ధి 95 శాతం పూర్తి చేసి శాసన సభ్యులతో గడప గడపకు వెళుతున్నట్లు తెలిపారు. వెళ్లిన ప్రతి చోట మహిళలు బ్రహ్మరథం పడుతున్నారని, ఇదే జగనన్న మంచి పాలనకు నిదర్శనమన్నారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఇతిహాసాలపై విద్యార్థులకు అవగాహన



యోగాలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు కథలు వినిపిస్తున్న గ్రంథాలయాధికారి రాజు

అల్లిపురం: పాతనగరంలోని వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఇతిహాసాలు, యోగాపై అవగాహన తరగతులు నిర్వహించారు. దీంట్లో భాగంగా బాక్సింగ్ కోచ్ కీర్తన రాజు ప్రతిరోజు ఉదయం బాక్సింగ్‌లో శిక్షణ అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఎస్.అప్పారావు తెలిపారు. త్వరలోనే కోలాటం కూడా నేర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్వాతంత్య్ర సమరయోధులే స్ఫూర్తి

అల్లిపురం: బుధవారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో యు లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పీవీఎస్ రాజు విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధుల గురించి వివరించారు. వారి జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలన్నారు. అనంతరం ఇంగ్లీష్ స్టోరీ టెల్లింగ్ వీడియోను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. రానున్న రోజుల్లో గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరంలో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్నేహితులు, బంధువులను గ్రంథాలయానికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల నాటకం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, బాదంగీర్ సాయి తదితరులు

అల్లిపురం: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన నాటకానికి సంబంధించిన పోస్టర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆవిష్కరించారు. మేయర్ ఛాంబర్‌లో బుధవారం ఆమెను రంగసాయి గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్.నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె రంగసాయి నాటక గ్రంథాలయం శాశ్వత నిధుల సమీకరణకు నిర్వహిస్తున్న ఘంటసాల నాటకం ప్రతి ఒక్కరూ చూడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు ప్రదర్శనలుగా ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు బాదంగీర్‌సాయి తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి నాట్యమండలి, సురభి కళాకారులు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా నాటక గ్రంథాలయాన్ని విశాఖలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాటక గ్రంథాలయ పాలకులు జమ్మా చిన్నబాబు పాల్గొన్నారు.

గోవును గట్టెక్కించారు.!



పెదగదిలి ఎర్నిమాంబ ఆలయం వద్ద బావిలో జారిపడిన ఆవును బయటికి తీస్తున్న స్థానికులు

ఆరిలోవ: మేత కోసం వెళ్లిన ఓ ఆవు చిక్కుల్లో పడింది. రెండు రోజుల తర్వాత బతుకుజీవుడా అంటూ బయటపడింది. వివరాలిలా ఉన్నాయి. పెదగదిలిలోని ఎర్నిమాంబ ఆలయం సమీపంలో మేత కోసం ఓ ఆవు మంగళవారం వెళ్లింది. ఇక్కడ గతంలో స్థానికులు వ్యవసాయం సాగు కోసం బావి తవ్వించారు. ఇప్పుడు ఈ బావి నీరు లేక ఎండిపోయింది. మంగళవారం మేతకు వెళ్లిన ఆ ఆవు ఈ బావిలో జారిపోయింది. చుట్టూ సుమారు 8 అడుగుల ఎత్తులో గోడలు నిర్మించి ఉండడంతో అందులో నుంచి బయటికి రాలేకపోయింది. ఆ ఆవు యజమాని బుధవారం వెతుకుతుండగా బావిలో ఓ మూలన కనిపించింది. దీంతో స్థానికుల సహాయంతో ఆవుకు తాళ్లు కట్టి, చెక్కలతో అమర్చిన బల్ల ఏర్పాటు చేసి దాని మీద నుంచి అతి కష్టమ్మీద బయటికి తీసుకొచ్చారు. జారిపోవడం వల్ల ఆవు కాళ్లు, వెనుక భాగం స్వల్ప గాయాలయ్యాయి.

పేపర్ ఆర్ట్‌పై శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పేపర్ పెయింటింగ్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వారిలో సృజనాత్మక కళలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫెవికాల్ కంపెనీ ప్రతినిధి జి.శిరీష లత రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు మాస్టర్, రైల్వే డివిజన్ లోకో పైలట్ జామి అన్నాజీరావు, గ్రంథాలయ అధికారి వై.పద్మజ పాల్గొన్నారు.

ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి



818వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 818వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ట్రాఫిక్ విభాగం కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ ప్రజల ఆస్తిని కార్పొరేట్ సంస్థలకు అమ్మడం అంటే తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమే అవుతుందని విమర్శించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.